తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT

సంపుటి: 1 సంచిక: 55 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ మంగళవారం 24-09-2023 వెల: 5/రూ -




## ప్రభుత్వ పథకాలన్నిటికీ
# ఇకపై ఒకే కార్డు

### ప్రతి కుటుంబానికి ఓ డిజిటల్ కార్డు ఇచ్చే సన్నాహాల్లో సర్కారు
### సీఎం రేవంత్ ఆధ్వర్యంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో చర్చ



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రతి పథకానికి ఇకపై ఒకే కార్డు ఆధారం కానుంది. అదే డిజిటల్ కార్డు. ప్రతి కుటుంబానికీ ఇచ్చే ఈ డిజిటల్ కార్డులో కుటుంబసభ్యుల వివరాలన్నీ నమోదై ఉంటాయి. ఆరోగ్య, సంక్షేమ పథకాలతో పాటు రేషన్ సరుకులకు సైతం ఉపయోగపడేలా ఈ కార్డును రూపొందించనున్నారు. కుటుంబానికి చెందిన ఆధార్ కార్డు లేదా సెల్ నంబర్‌ను ఈ డిజిటల్ కార్డుతో అనుసంధానిస్తారు. ప్రస్తుతం కర్ణాటక, రాజస్తాన్, మహారాష్ట్ర, హరియాణా రాష్ట్రాల్లో కుటుంబ ఆర్యోగానికి సంబంధించిన సమాచారాన్ని డిజిటల్ కార్డులో పొందుపరిచి ఉపయోగిస్తున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి అన్ని ప్రభుత్వ పథకాలకు చిప్ అమర్చిన ఒకే డిజిటల్ కార్డు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చింది.

- ఆరోగ్య, సంక్షేమ పథకాలతోపాటు రేషన్‌కు సైతం ఈ కార్డే ఆధారం
- ఆధార్/సెల్ నంబర్‌తో అనుసంధానంకుటుంబసభ్యుల వివరాలన్నీ నమోదు
- పొందుతున్న పథకాలు, ఆరోగ్య సమాచారం నిక్షిప్తం
- ప్రతి నియోజకవర్గంలోని ఒక పట్టణం, ఒక గ్రామంలో పైలట్ ప్రాజెక్టు
- ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి త్వరగా నివేదిక ఇవ్వాలన్న సీఎం



## టీటీడీ ఆస్తుల రక్షణ
# ప్రభుత్వ బాధ్యత

ప్రభుత్వ ఆస్తులను తనఖాలు పెట్టేసిన గత పాలకులు..

టీటీడీ ఆస్తుల రక్షణ ప్రభుత్వ బాధ్యత.. గత పాలకులు ప్రభుత్వ

ఆస్తులనే తనఖా పెట్టేశారు టీటీడీ, దేవదాయ శాఖ ఆస్తుల

జోలికి వెళ్లకుండా ఉంటారా?

నిరర్థక ఆస్తులంటూ శ్రీవారి ఆస్తులకే ఎసరు పెట్టాలనుకున్నారు

శ్రీవాణి ట్రస్టు నిధులు మళ్లించేశారు

గత పాలక మండళ్ల నిర్ణయాలపై సమగ్ర విచారణ చేయాలిసీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ విజ్ఞప్తి

అమరావతి: ప్రభుత్వ ఆస్తులను తనఖాలు పెట్టేసిన గత పాలకులు.. దేవుడి మాన్యాలు, ఆస్తుల జోలికి వెళ్లకుండా ఉంటారా? అనే సందేహం ప్రజల్లో ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన

2లో



2లో

# కేజ్రీ కోసం కుర్చీ ఖాళీగా..

రామాయణంలో భరతుడిలా పాలిస్తా!

ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆతిశీ వ్యాఖ్యలు

నెలలు భరతుడిలా పాలన!.. కేజ్రీవాల్ మళ్లీ సీఎం అయ్యేదాకా

ఆయన కుర్చీ అలాగే ఉంటుంది... సీఎం ఆఫీసులో రెండో కుర్చీ



# రాష్ట్రంలో ప్రజారోగ్యం అస్తవ్యస్తం

బీఆర్ఎస్ 'ప్రజారోగ్య కమిటీ' సభ్యుల మండిపాటు

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గాంధీ ఆస్పత్రిలో మాతాశిశు మరణాలు జరిగాయని ఆరోపణ

గాంధీ ఆస్పత్రిలో పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలు

వారిని అడ్డుకున్న పోలీసులు.. ఆందోళనకు దిగిన కార్యకర్తలు

ఎమ్మెల్యేలు సంజయ్, గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అరెస్టు

2లో



# కాంగ్రెస్ నేతలు నన్ను అభినందిస్తున్నారు

అమృత్ కుంభకోణం బయటపెట్టినందుకు మెసేజ్‌లు వస్తున్నాయి

'అమృత్'అంశంలో రేవంత్‌రెడ్డి, బీజేపీ కుమ్మక్కు బయటపడింది

సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

'ఎక్స్'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## పిల్లల పోర్నోగ్రఫీ
# వీక్షణ నేరమే!

వీడియోలు డౌన్‌లోడ్, స్టోర్ చేసుకోవడం పోక్సో చట్టం కింద నేరపూరిత చర్యలే

దేశ అత్యున్నత ధర్మాసనం కీలక తీర్పు

పిల్లల అశ్లీల చిత్రాలు చూడటం నేరం కాదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు కొట్టివేత

హైకోర్టు తీర్పు ఘోర తప్పిదమని వ్యాఖ్య

హైదరాబాద్: పిల్లల అశ్లీలత, వారిపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలను చూడటం ముమ్మాటికీ నేరమేనని

2లో




## ఇజ్రాయెల్ దాడుల్లో
# 274 మంది మృతి

300 లక్ష్యాలపై దాడులు.. 1,000 మందికి గాయాలు

జెరూసలెం: హెజ్బొల్లా ఉగ్రవాదులకు ఇజ్రాయెల్ సైన్యం చుక్కలు చూపిస్తున్నది. 2006 తర్వాత అత్యంత భీకరంగా సోమవారం



# ఇజ్రాయెల్ దాడుల్లో 274 మంది మృతి

దాదాపు 300 లక్ష్యాలపై దాడులు జరిపింది. ఇందులో 274 మంది మరణించగా, సుమారు 1,000 మంది గాయపడ్డారు. హెజ్బొల్లాపై గగనతలం నుంచి విరుచుకుపడతామని, ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోవాలని దక్షిణ, తూర్పు లెబనాన్ ప్రజలను ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. హెజ్బొల్లా ఆయుధాగారాలపై దాడులు చేస్తామని చెప్పింది. దీంతో ప్రలు లెబనాన్ రాజధాని నగరం బీరుట్ వైపు హుటాహుటిన కార్లు, తదితర వాహనాల్లో పరుగులు తీశారు. గత ఏడాది అక్టోబర్ నుంచి గత మంగళవారం పేజర్ల పేలుళ్లు జరిగే వరకు ఇజ్రాయెల్ దాడుల్లో సుమారు 600 మంది లెబనాన్ ప్రజలు మరణించారు. వీరిలో 100 మందికిపైగా సాధారణ ప్రజలు. మరిన్ని దాడులు చేయడానికి సైనిక ప్రధాన కార్యాలయం నుంచి ఆమోదం లభించిందని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. గలీలీలోని ఇజ్రాయెల్ సైనిక స్థావరంపై డజన్లకొద్దీ రాకెట్లను ప్రయోగించామని హెజ్బొల్లా తెలిపింది. ఇజ్రాయెల్ చర్యలు సమూల నాశనం కోసం యుద్ధంతో సమానమని లెబనాన్ ప్రధాన మంత్రి ఆరోపించారు.

అక్టోబర్ 7 నాటి దాడుల రూపకర్త, హమాస్ అధినేత యాహ్యా సిన్వార్ మృతి చెందినట్టు ఇజ్రాయెల్ దళాలు అనుమానిస్తున్నాయి. సుదీర్ఘ కాలంగా అతడి కదలికలు లేకపోవటంతో అతడు సజీవంగా ఉండకపోవచ్చునని భావిస్తున్నాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి.

# పిల్లల పోర్నోగ్రఫీ వీక్షణ నేరమే!




దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటంతో పాటు ఆ వీడియోలను డౌన్‌లోడ్ చేయడం, స్టోర్ చేసుకోవడం కూడా పోక్సో చట్టం ప్రకారం నేరం కిందకే వస్తుందని పేర్కొంది. ఇలాంటి పనులకు తెగబడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని వెల్లడించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం నేరం కాదంటూ మద్రాసు హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును కొట్టేసిన న్యాయస్థానం.. ఇలాంటి తీర్పునిచ్చి హైకోర్టు ఘోరమైన తప్పిదం చేసిందని వ్యాఖ్యానించింది.

**ధర్మాసనం ఏమన్నదంటే?**

- పోక్సో చట్టంలో 'చైల్డ్ పోర్నోగ్రఫీ' అనే పదాన్ని 'చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూసివ్ మెటీరియల్' అనే పదంతో మార్చాలి. ఈ మేరకు పోక్సో చట్టానికి సవరణలు చేయాలి.
- పై సవరణలు అమల్లోకి వచ్చేవరకు దీనిపై ఆర్డినెన్స్ జారీ చేయాలి. ఇకపై కోర్టులు 'చైల్డ్ పోర్నోగ్రఫీ' పదాన్ని ఉపయోగించవద్దు.
- చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన వీడియోలు స్టోర్ చేసిన వారికి తొలిసారిగా రూ. 5వేల వరకు జరిమానా విధించాలి.
- ఇలాంటి చర్యలకు మళ్లీ పాల్పడితే రూ.10 వేల వరకు జరిమానా వేయాలి. పిల్లల అశ్లీల వీడియోలను దురుద్దేశంతో ప్రసారం చేస్తే జరిమానాతో పాటు మూడేండ్ల వరకు జైలు శిక్ష విధించాలి.
- డబ్బుల కోసం చైల్డ్ పోర్నోగ్రఫీని ప్రోత్సహించడం, ఆ వీడియోలను ప్రసారం చేస్తే మూడు నుంచి ఐదేండ్ల పాటు జైలు శిక్ష విధించాలి. గరిష్ఠంగా ఏడేండ్ల పాటు జైలు శిక్ష విధించాలి.
- ఏమిటీ కేసు?
- చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన వీడియోలను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న 28 ఏండ్ల ఓ యువకుడిపై క్రిమినల్ చర్యలను నిలిపివేస్తూ మద్రాసు హైకోర్టు గతంలో ఆదేశాలిచ్చింది. పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం.. చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం తప్పేమీ కాదంటూ ఆ సందర్భంగా వ్యాఖ్యానించింది. సదరు యువకుడు వీడియోలు చూడటం తప్ప ఏమీ చేయలేదని, వాటిని ఇతరులకూ పంపలేదని పేర్కొంది.
- పోర్నోగ్రఫీకి అలవాటుపడిన యువతను శిక్షించడం కన్నా వారిని సరైన మార్గం వైపు నడిపించడంపై దృష్టి పెట్టాలని అభిప్రాయపడింది. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పును తోసిపుచ్చిన సుప్రీంకోర్టు సదరు యువకుడిపై క్రిమినల్ చర్యలను పునరుద్ధరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలను డౌన్‌లోడ్ చేసుకొన్నాడంటే, ఆ దురుద్దేశం యువకుడికి ఉందన్నది స్పష్టమవుతున్నదని కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.
- లైంగిక విద్యపై అపార్థాలు ఉన్నాయి: సుప్రీంకోర్టు

ఈ కేసు విచారణ సందర్భంగా లైంగిక విద్యపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'తల్లిదండ్రులు, అధ్యాపకులు సహా చాలా మంది శృంగారం గురించి చర్చించడం సరికాదని, అనైతికమని, ఇబ్బందికరమనే సంప్రదాయవాద భావాలు కలిగి ఉన్నారు. సెక్స్ ఎడ్యుకేషన్ అనేది పాశ్చాత్య అంశమని, సంప్రదాయ భారతీయ విలువలకు తగనిదనే భావన ఉంది. ఈ భావనతోనే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సెక్స్ ఎడ్యుకేషన్‌ను నిషేధించాయి.

- ఈ రకమైన వ్యతిరేకత తో సమగ్ర, సమర్థవంతమైన సెక్స్ ఎడ్యుకేషన్ అందకపోవడం వల్ల కౌమార దశలో ఉన్న వారికి తప్పుడు సమాచారం వెళు_న్నది. వారు ఇంటర్నెట్ వైపు వెళ్లి నియంత్రణ లేని సమాచారం పొందుతున్నారు. సెక్స్ ఎడ్యుకేషన్ అంటే కేవలం జీవపరమైన పునరుత్పత్తి మాత్రమే అనే అపార్థం ఉంది. సమర్థవంతమైన సెక్స్ ఎడ్యుకేషన్‌లో అంగీకారం, ఆరోగ్యకరమైన సంబంధాలు, లింగ సమానత్వం వంటి అంశాలు ఉండాలి. శారీరక హింసను తగ్గించడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో ఇవి కీలకం' అని జస్టిస్ పార్దీవాలా పేర్కొన్నారు.

# కేజ్రీ కోసం కుర్చీ ఖాళీగా..



(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ఆతిశీ బాధ్యతలు చేపట్టారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆమె.. పక్కనే పాత సీఎం అరవింద్ కేజ్రీవాల్ కుర్చీని ఖాళీగా ఉంచారు. ఆయన వాడిన కుర్చీ పక్కనే మరో కుర్చీలో కూర్చొని ఆతిశీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రామాయణంలో సన్నివేశాన్ని ప్రస్తావించారు. రాముడు వనవాసానికి వెళ్లిన సమయంలో భరతుడు రాజ్యాన్ని ఏలాల్సి వచ్చిందన్నారు. అప్పుడాయన రాముడి పాదుకలు సింహాసనంపై ఉంచి బాధ్యతలు నెరవేర్చారని గుర్తుచేశారు. ఇప్పుడు తనదీ అదే పరిస్థితి అని ఆతిశీ చెప్పారు. భరతుడి స్ఫూర్తితోనే తాను నాలుగు నెలల పాటు ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపిస్తానని తెలిపారు.త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు మళ్లీ ఆమ్ ఆద్మీ పార్టీకే పట్టం కడతారని, అరవింద్ కేజ్రీవాల్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

"ఈ కుర్చీ అరవింద్ కేజ్రీవాల్‌దే. ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు మరోసారి ఆయన్నే ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారు. అప్పటి వరకు ఈ కుర్చీ సీఎం కార్యాలయంలోనే ఉంటుంది. కేజ్రీవాల్ పునరాగమనం కోసం ఎదురుచూస్తూ ఉంటుంది" అని ఆతిశీ చెప్పారు. ఢిల్లీ ఎనిమిదో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆతిశీ (43).. ఈ పీఠాన్ని అధిరోహించిన అతి పిన్న వయస్కురాలు. అలాగే మూడో మహిళ. అంతకు ముందు కాంగ్రెస్ తరఫున షీలా దీక్షిత్, బీజేపీ తరఫున సుష్మా స్వరాజ్‌లు ఢిల్లీ ముఖ్యమంత్రులుగా పనిచేశారు. ప్రస్తుతం దేశంలో ఆతిశీ రెండో మహిళా ముఖ్యమంత్రి. ఇక ఆతిశీతో పాటు ఐదుగురు ఆప్ ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో నలుగురు పాతవారు కాగా.. ఒకరు కొత్త ఎమ్మెల్యే. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ముకేశ్ అహ్లావత్‌తో పాటు గోపాల్‌రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, కైలాశ్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్‌లు మంత్రులుగా ప్రమాణం చేశారు. కేజ్రీవాల్ ప్రభుత్వంలో మంత్రిగా 13 శాఖలను చూసుకున్న ఆతిశీ.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా వాటిని తన వద్దే ఉంచుకున్నారు.

**ఇది రాజ్యాంగాన్ని అగౌరవపర్చడమే: బీజేపీ**

ఢిల్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆతిశీ తీరును బీజేపీ తీవ్రంగా ఖండించింది. సీఎం ఆఫీసులో ఆమె కుర్చీ పక్కనే కేజ్రీవాల్ కోసం మరో కుర్చీని ఖాళీగా ఉంచడాన్ని తప్పుపట్టింది. ఆతిశీ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించారని బీజేపీ ఢిల్లీ శాఖ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ ఆరోపించారు. తన వ్యవహారశైలితో ఆమె సీఎం కార్యాలయాన్ని అవమానించారన్నారు. సీఎం ఆఫీసు డెస్కు లో రెండు కుర్చీలు వేయడం ద్వారా రాజ్యాంగాన్ని అగౌరవపర్చారని ఆరోపించారు. సీఎం ఆఫీసు గౌరవానికి భంగం కలిగించడమేగాక ఢిల్లీ ప్రజల మనోభావాలను కూడా కించపరిచేలా వ్యవహరించారంటూ ఆతిశీపై ధ్వజమెత్తారు.

# ప్రభుత్వ పథకాలన్నిటికీ ఇకపై ఒకే కార్డు

ఇందులో ఒక్కో పథకానికి ఒక్కో నంబర్‌ను కేటాయిస్తారు. తొలిదశలో ప్రుయోగాత్మకంగా ప్రతి నియోజకవర్గంలో ఒక పుట్టణం, ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని ఈ విధానాున్ని అమలు చేసేందుకు రంగం సిద్ధమైంది. అయితే ప్రయోగాత్మకంగా అమల్లోకి తీసుకురావడానికి ముందే ఆయా రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాన్ని అధ్యయనం చేయాలని, అక్కుడ ఎదురవుతున్న సమస్యలు ఇక్కడ తలెత్తకుండా పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుుత్వం భావిస్తోంది. ఈ మేరకు అధికారుల బృందాన్ని అక్కడకు పంపించాలని నిర్ణయించారు. అన్ని రికార్డులు ఒకే దగ్గర..: కేవలం ఆరోగ్యానికి సంబంధించిన అంశాలే కాకుండా.. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, ఆ కుటుంబ సభ్యులకు అందుతున్న పథకాల వివరాలను కూడా ఈ డిజిటల్ కార్డులో పొందుపర్చనున్నారు. ఒక కుటుంబంలో నలుగురు సభ్యులుంటే..ఆ కుటుంబానికి ఒక యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూఐఎన్)ను కేటాయించి, కుటుంబసభ్యుల సంఖ్య ఆధారంగా ఆ యూఐఎన్‌కు బై నంబర్ కేటాయిస్తారు. ఆ బై నంబర్ ఎదురుగా ఆ కుటుంబ సభ్యుని పేరు, ఆ సభ్యుడి సమస్త సమాచారం ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ డిజిటల్ కార్డు పూర్తిగా సురక్షితమైనదని, అన్నిరకాల రికార్డులు ఒకే దగ్గర అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. కాగా కుటుంబంలోని ప్రతి ఇంటి సభ్యుని హెల్త్ ప్రొఫైల్ అందులో ఉండాలని, తద్వారా దీర్ఘకాలంలో వైద్య సేవలకు ఇది ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య సమాచారంతో పాటు, సంక్షేమ పథకాలు కూడా ఒకేచోట ఒకే క్లిక్‌తో లభ్యమవుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఎక్కడైనా సేవలు, రేషన్ పొందేలా..**

రాజస్థాన్, హరియాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కార్డులపై అధ్యయనం చేయాలని, వాటితో కలుగుతున్న ప్రయోజనాలు, ఇబ్బందులపై అధ్యయనం చేసి త్వరగా ఒక సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఉండాలని సూచించారు. లబ్ధిదారులు ఎక్కడైనా రేషన్, ఆరోగ్య సేవలు పొందేలా ఈ కార్డులు ఉండాలని అన్నారు.

# కాంగ్రెస్ నేతలు నన్ను అభినందిస్తున్నారు

హైదరాబాద్: అమృత్ టెండర్లలో రేవంత్‌రెడ్డి మోసాన్ని బయటపెట్టినందుకు కొందరు సీనియర్ కాంగ్రెస్ నేతల నుంచి తనకు అభినందన సందేశాలు వచ్చినట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. కానీ రేవంత్‌రెడ్డి అక్రమాలపై బీజేపీ నేతల మౌనం తనకు ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిస్థితు లను అధ్యయనం చేసేందుకు వెళ్లిన పార్టీ అధ్య యన బృందం సభ్యులను పోలీసులు అరెస్టు చేయ డాన్ని కేటీఆర్ ఖండించా రు. రాజకీయాలకు అతీ తంగా ప్రజాసంక్షేమం కోసమే స్వయంగా డాక్ట ర్లతో కూడిన తమ పార్టీ ప్రతినిధి బృందం ఆస్పత్రు లను సందర్శిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఎన్ని పిరికిపంద చర్యలకు పాల్పడినా, ప్రజారోగ్య వ్యవస్థ లోపా లను ఎత్తిచూపుతామని ప్రకటించారు. ప్రభుత్వం నిజాలు దాచని పక్షంలో బీఆర్ఎస్ నిజ నిర్ధారణ కమిటీ దర్యాప్తునకు సహకరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పట్టణ పేదలకు ఉచిత వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 400కు పైగా బస్తీ దవాఖానాలను నడపడం రేవంత్ ప్రభుత్వానికి చేతకావడం లేద న్నారు. ఓ వైపు విష జ్వరాలతో నగరవాసులు నరక యాతన పడుతుంటే, అసమర్థ పాలనలో ఆదుకో వాల్సిన బస్తీ దవాఖానాలకే సుస్తీ చేసిందన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని కేటీఆర్ ఫోన్‌లో పరామర్శించారు. ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేసి విధ్వంసం చేసే ప్రయ త్నం చేశారని, సంఘటన వివరాలు, సునీతాలక్ష్మా రెడ్డి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ గుండాలపై పోలీసులు కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చిల్లర ప్రయత్నాలతో సునీతాలక్ష్మారెడ్డి లాంటి బలమైన నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేమనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ ఎన్ని అరాచకాలకు పాల్పడినా, 60 లక్షల మంది కేడర్ కలిగిన బీఆర్ఎస్ కుటుంబం ప్రతీ ఒక్కరికి అండగా ఉంటుందన్నారు.

# రాష్ట్రంలో ప్రజారోగ్యం అస్తవ్యస్తం

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని.. మాతాశిశు మరణాలు, విషజ్వరాలు పెరిగిపోతు న్నాయని బీఆర్ఎస్ 'ప్రజారోగ్య కమిటీ' మండిప డింది. రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజాపాలన కాదని, ఎమర్జెన్సీ పాలన అని ఆరోపించింది. గాంధీ ఆస్ప త్రిలో పరిస్థితులను పరిశీలించేందుకు వెళ్తే పోలీ సులు అడ్డుకోవడం దారుణమని మండిపడింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిస్థితుల అధ్యయనం కోసం బీఆర్ఎస్ పార్టీ డాక్టర్ టి.రాజయ్య నేతృత్వంలో.. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌లతో కమిటీని వేసింది. సోమవారం ఉదయం తెలంగాణ భవన్ నుంచి గాంధీ ఆస్పత్రికి వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని.. మాతాశిశు మరణాలపై నిజనిర్ధారణ చేయాలని ఈ కమిటీ నిర్ణయించింది. అయితే కమి టీకి నేతృత్వం వహిస్తున్న టి.రాజయ్యను పోలీ సులు ఉదయమే ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గృహ నిర్బంధం చేశారు. మిగతా ఇద్దరు సభ్యులు డాక్టర్ సంజయ్, డాక్టర్ మెతుకు ఆనంద్ పోలీసుల కళ్లు గప్పి తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు.అక్కడి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మరికొందరు పార్టీ నేతలతో కలసి గాంధీ ఆస్పత్రికి వెళ్లారు. పోలీసులు వారిని ఆస్పత్రి ప్రధాన గేటు వద్దే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత లు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట జరగ డంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు మాగంటి గోపీనాథ్, సంజయ్, మెతుకు ఆనంద్ లను అరెస్టు చేసి నారాయణగూడ ఠాణాకు.. ఇతర నేతలు, కార్యకర్తలను ఈడ్చుకెళ్లి వ్యాన్లలోకి ఎక్కించి బొల్లారం ఠాణాకు తరలించారు. మధ్యాహ్నం తర్వాత నేతలు, కార్యకర్తలను వదిలేశారు. గాంధీ ఆస్పత్రి ఘటన తర్వాత తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ప్రజారోగ్య కమిటీ సభ్యులు రాజయ్య, సంజయ్, మెతుకు ఆనంద్ మీడియాతో మాట్లా డారు. సీఎం, మంత్రుల సమీక్ష లేకపోవడంతో.. రాష్ట్రంలో ప్రజారోగ్యం కుంటుపడిందని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు తగ్గిపోయాయని రాజయ్య ఆరోపించారు. నిజనిర్ధారణ కోసం గాంధీ ఆస్పత్రికి వెళ్లిన కమిటీ సభ్యులను పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు.రాష్ట్రంలో విష జ్వరాలు విజృంభిస్తున్నా ప్రభుత్వం నిద్రపోతోందని డాక్టర్ సంజ య్ విమర్శించారు. ఆస్పత్రుల్లో డొల్లతనం బయట పడుతుందనే తమకు అడ్డుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని డాక్టర్ మెతుకు ఆనంద్ మండిపడ్డారు. నిపుణులైన వైద్యులు లేకే, ఆస్పత్రుల్లో మరణాలు సంభవి స్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగుతున్న మాతాశిశు మరణాలపై సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దాపరికంగా వ్యవహరి స్తోందని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోపించారు. గాంధీ ఆస్పత్రి బయట ఆయన మీడియాతో మాట్లాడారు.

# టీటీడీ ఆస్తుల రక్షణ ప్రభుత్వ బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

ఓ ప్రకటన విడుదల చేశారు. 'టీటీడీ ఆస్తులు, ఆభరణాలతో పాటు దేవదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాలూ, సత్రాల ఆస్తుల వివరాలు, సదరు ఆస్తుల ద్వారా వస్తున్న రాబడినీ ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. తద్వారా దేవుడి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ఉండటంతో పాటు ఆలయాల పాలక మండళ్లు జవాబుదారీతనంతో పని చేస్తాయి. ఆ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది' ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. టీటీడీకి సంబంధించిన ఆస్తులే కాకుండా దేవదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాలు, సత్రాల ఆస్తుల విషయంలోనూ ఒక సమీక్ష అవసరమని సీఎం చంద్రబాబును కోరారు. 'తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిపై అచంచల విశ్వాసంతో భక్తులు ఎంతో విశ్వాసంతో ఇచ్చిన ఆస్తులను నిరర్థకం అంటూ విక్రయించాలని వైసీపీ పాలనలోని టీటీడీ పాలక మండలి నిర్ణయించి ప్రకటన కూడా ఇచ్చింది. అసలు నాటి పాలక మండలి స్వామి వారి ఆస్తులను పరిరక్షణ కంటే పప్పుబెల్లాల్లా అమ్మేయడానికే ఎందుకు ఉత్సాహపడింది? వారిని ఆ విధంగా నడిపించింది ఎవరనేది బయటకు తీస్తాం. స్వామి వారి ఆస్తులను గత పాలక మండళ్లకు నేతృత్వం వహించిన వారు కాపాడారా? అమ్మేశారా? అన్న సందేహాలు వస్తున్నాయి. తిరుమల శ్రీవారి ఆస్తులను పరిరక్షించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకొంటుంది. ఈ క్రమంలో గత పాలక మండళ్లు టీటీడీ ఆస్తుల విషయంలో చేసిన నిర్ణయాలపై సమగ్ర విచారణ చేయించాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును విజ్ఞప్తి చేస్తున్నా' అని పేర్కొన్నారు. 'వైసీపీ హయాంలో టీటీడీ పాలక మండలి తమిళనాడులో 23 ఆస్తులను వేలం ద్వారా విక్రయించాలని, ఆ ఆస్తుల విలువ రూ. 23.92 కోట్లుగా లెక్కగట్టారు.

# రాళ్ళల్లో రత్నాలు పండిస్తారు అన్నది ఒకప్పటి మాట!

# ఇప్పటి మాట గంజాయి సాగు చేస్తారు

## బిఏజెన్సీ ప్రాంతాలలో గుట్టు చప్పుడు కాకుండా పెంపకం

## బిదీనిపై పోలీసుల ప్రత్యేక నిఘా తనిఖీలు

## బిబజార్ హత్నూర్ పోలీసులు గ్రామాలపై గంజాయి పై ఉక్కు పాదం

## బియువత పీడదారి పట్టకుండా చర్యలు తీసుకుంటున్న పోలీసులు





**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** రాళ్ళల్లో రత్నాలు పండిస్తారు అన్న మాట ఒకప్పటి మాట. ఇప్పుడు మాత్రం గంజాయి సాగు చేస్తారు అని చెప్పవచ్చు.అయితే గంజాయి పంట పండిస్తే వారికి ఎంత లాభమో తెలియదు గానీ దేశానికి మాత్రం తీరని నష్టం కల్గిస్తుంది. ముఖ్యంగా యువత, పెద్ద డబ్బున్న వారు కూడా పెద్ద పెద్ద పట్టణంలో చదువుకోవడం కోసం వెళ్లిన పిల్లలు దీన్ని అలవాటుగా చేసుకొంటే వాడి బతుకు బజారు పాలే అని చెప్పవచ్చు. అందుకే ప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డి పాలనలో దీనిపై ఉక్కు పాదం మోపుతుంది. అందుకని సాగుచేస్తున్న రైతులకు అవగాహన కల్పించి ఇకముందు ఇలాంటి పంటలు పండి%శీ%చవద్దని కౌన్సిలింగ్ చేయాల్సిన అవసరం ఉంది. గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి ఒక్కడికి శిక్ష వేసే బదులు అవగాహనతో ఇది అరికట్టి ప్రజలు అభివృద్ధి చెందవచ్చు అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నవి.బజార్ హత్నూర్ మండలంలో ఇటీవల కొత్తగా వచ్చిన ఎస్ ఐ జి. అప్పారావ్ ఈ గంజాయి సాగు చేస్తున్నవారి మీద గట్టి నిఘా పెట్టి గంజాయిని పట్టుకొని కేసులు నమోదులు చేస్తున్నారు. మొన్నటికీ మొన్న డాబాడిలో నలుగురు వ్యక్తులను పట్టుకొన్నారు. ఆదివారం రోజు బజార్హత్నూర్ మండలంలోని చిన్నుమియా తండాకు చెందిన ధంగర్ రాజు తన పత్తి పంటలో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసి పట్టుకొని గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.అతని వద్ద 65 మొక్కలు పెటుకున్నారు. దాభాడిలో అయితే 100 మొక్కలు పట్టుకొన్నారు.ఉక్కు పాదం మోపి దాడులు చేస్తున్నప్పటికీ గంజాయి సాగు చేయడం రైతులు మానడం లేదు. ఏదో అది అలవాటు ఉందని పూర్వకాలంలో పెద్ద మనుషులు ఒక చెట్టు పెంచుకొని ఇంట్లో నిత్య వాడకం కోసం ఉంచుకొనే వారు.నేడు గంజాయి సాగు ఇంతలా పాకిపోయింది అంటే దేశంకు చాలా నష్టం కల్గించేతట%శీ%తా అన్నమాట. ఇది ఇలా ఉండగా గంజాయి ఎక్కువ సాగు కొండ ప్రాంతం బంజరు భూముల్లో, గడ్డి భూముల్లో సాగవుతున్నాయి. ఒకటి రైతులు ఇది పండిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని అత్యాశ కారణం, దీనికి తోడు కొండ ప్రదేశంలో ఏ పంటలు వేసిన వర్షాలు సరి అయిన విదంగా సమయానికి కురిస్తే తప్ప పంటలు దిగుబడి రాదు. ప్రత్యామ్నాయం పంటలు పై అక్కడి రైతులకు అవగాహన ఉండదు. మొక్క జొన్న ఈ మధ్య పండిస్తున్నారు. వారికి గిట్టుబాటు బాటు కాక ఈ అక్రమ పంటల వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి అక్రమ గంజాయి సాగును ప్రభుత్వం రైతులకు విస్తృతంగా ఎక్సయిజ్ శాఖ ద్వారా సభలు పెట్టి అవగాహన సదస్సుతో అరి కడితే బాగుంటుంది అని పలు అభిప్రాయాలు వెలువడు తున్నాయి.





## పబ్లిక్ ప్లేస్ లలో స్వచ్ఛతా హి క్లీన్ అండ్ గ్రీన్



శంకర్‌పల్లి: సెప్టెంబర్ 23: (డైలీ రిపోర్ట్): స్వచ్ఛతా హి సేవా - 2024 కార్యక్రమంలో భాగంగా సోమవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పార్క్ లు, పబ్లిక్ ప్లేస్ లు, మూసి వాగు బ్రిడ్జి దగ్గర మాస్ క్లీనింగ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాల్టీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరి పై ఉన్నదని ఆమె పేర్కొన్నారు. మున్సిపాల్టీ పరిధిలో ఎక్కడ పడితే అక్కడ చేత వేయడం వలన మున్సిపాల్టీ మొత్తానికి చెడ్డ పేరు వస్తున్నదని ప్రజలందరూ కూడా తమ ఇంటి వద్దకు వచ్చే ఆటోలోనే చెత్తను వేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట్ రాంరెడ్డి, కమిషనర్ శ్రీనివాస్, మేనేజర్ అంజన్ కుమార్ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ ఆనంద్, సానిటరీ ఇన్స్పెక్టర్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## 1989 పోలీసు బ్యాచ్ మిత్రుల ఉదారత

### బాధిత ఏఎస్ఐ కుటుంబ సభ్యులకు 50 వేల రూపాయల చెక్కు ను అంత చేసిన జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్.

**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** పూర్తి వివరాలలో ఆదిలాబాద్ జిల్లా వాస్తవ్యుడైన ఎఎస్ఐ యూనుస్ ఖాన్ సిఐడి హైదరాబాద్ నందు విధులు నిర్వర్తిస్తూ జూలై 7 వ తారీఖున అనారోగ్యంతో మరణించడం జరిగింది. వారి కుటుంబ సభ్యులను ఎలాగైనా ఆదుకోవాలని మంచి ఉద్దేశంతో, తన తోటి మిత్రుడు బ్యాచ్ సభ్యుడు ఆయన యూనుస్ ఖాన్ కుటుంబ సభ్యులకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా 1989 పోలీసు బ్యాచ్ కు సంబంధించిన పోలీసు మిత్రులు కలిసి 50వేల రూపాయల చెక్కును జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఐపిఎస్ చేతుల మీదుగా కొడుకు ఆదిల్ ఖాన్ కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాధిత కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ఎలాంటి సహాయ సహకారమైనా అందజేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుండి వచ్చే ప్రయోజనాలను వెంటనే అందే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోర్టు లైజన్ అధికారులు సయ్యద్ తాజుద్దీన్, ఈశ్వర్ సింగ్, రాఘువేంద్ర, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు ఏఎస్సై సుభాష్, హెడ్ కానిస్టేబుల్ అత్త ఉల్లా ఖాన్, జహీరుద్దీన్, సిబ్బంది కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## టీజీఐసీ చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి చేతుల మీదుగా డాడీస్ రోడ్ సేఫ్టీ క్యు ఆర్ డెకల్ ప్రారంభం

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబర్ 23:** సంగారెడ్డి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాడీస్ రోడ్ సేఫ్టీ క్యు ఆర్ డెకల్ ను టీజీఐసీ చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్ కార్యాలయంలో ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ లకు మరియు జాగ్రత్తలకు సూచనలు కోసం మంచి ఫీచర్స్ తో ఆక్సిడెంట్ నివారణకు యాక్సిడెంట్ అలర్ట్, బ్లడ్ బ్యాంక్, పార్కింగ్ ఇష్యూస్ స్టోర్ డాక్యుమెంట్లు , లాక్ అలెర్ట్ ఇవన్నీ ఉండడం చాలా సంతోషం అన్నారు. ఈ విధంగా ప్రజలు తొందరగా రోడ్డు జాగ్రత్తలు తెలుసుకోవడంలో సులువుంటుందని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న ముదిరాజ్, బలే రావు నవీన్ వర్మ, సాయి ప్రణీత్, మనివర్ధన్,జీవన్ వర్మ,సాయి వర్మ, తదితరులు పాల్గొన్నారు.




## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**శంకర్పల్లి సెప్టెంబర్ 23:(డైలీ రిపోర్ట్):** శ్రీ సరస్వతి శిశు మందిర్ 10 వ తరగతి పూర్వ విద్యార్థుల 1999-2000 సంవత్సరం బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం త్రిపుర రిసార్ట్స్ , శంకర్పల్లిలో జరిగింది. కార్యక్రమంలో ఆచార్యులు, మాతాజీలు, విద్యార్థులు పాల్గొన్నారు. అలనాటి బాల్యాస్మృతులు గుర్తు చేసుకుంటూ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నందుకు గర్వపడుతున్నారని ఈ ప్రేమను అలాగే కొనసాగించాలని అన్నారు. విద్యార్థులు మాట్లాడుతూ 24 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉందని, అందరూ జీవితంలో ఉన్నత స్థానంలో ఉండడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్ రెడ్డి, శివరాజ్, సిద్ధిరామేశ్వర్, శ్రీనివాస్, జనార్ధన్, గోపాల్, అనురాధ, గంగాధర్ పాల్గొన్నారు.

## తిరుపతి లడ్డును కలుషితం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### శంకర్‌పల్లి మండల బిజెపి ఉపాధ్యక్షుడు బండమీది వెంకటేష్



**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 23: (డైలీ రిపోర్ట్):** భారతీయులందరూ ఎంతో పవిత్రంగా భావించే తిరుమల తిరుపతి లడ్డును కలుషితం చేసిన వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని శంకర్‌పల్లి మండల భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షుడు బండమీది వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ పవిత్రమైన లడ్డు తయారీకి వినియోగించే నెయ్యిలో చేపల కొవ్వుతో పాటు ఇతర జంతువుల కళేబరాల నుంచి సేకరించిన నూనెను కలపడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ లో గత ప్రభుత్వంలో ఉన్న ముఖ్య నాయకులు, అధికారులపై ప్రభుత్వం అతి కఠినాత్మకంగా విచారించి వారిని బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా కుట్ర చేసిన వారి ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరాదని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ఉండడం కోసం బాధ్యులైన వారిని రాళ్లతో కొట్టి చంపాలని వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 లక్షల దేశవాళీ గోవులను కొండపై పెంచితే ఇలాంటి కల్తీలను అడ్డుకట్ట వేయవచ్చని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకొని వెంటనే నిందితులను అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# ప్రజల్ని మింగేస్తున్న స్టోన్ క్రషర్ గుంతలు దీనికి పట్టింపులు ఎక్కడ..!

## స్టోన్ క్రషర్ నిర్వాహకులు ఇష్టారాజ్యం

- భారీ గుంతల్లో పడి మృత్యువాత పడుతున్న జనం
- స్టోన్ కోసం తవ్వేస్తున్న భారీ గుంతల్లో పడి గాల్లో కలుస్తున్న ప్రాణాలు..
- భారీ గుంతలు ప్రమాదాలకు నెలవులు
- మృత్యు కుహారాలుగా మారుతున్న స్టోన్ క్రషర్ గుంతలు
- వారం రోజుల్లో ఇద్దరు మృతి ..
- గజ ఈతగాళ్ల సహాయంతో శవాలు బయటికి
- నిబంధనలు తుంగలో తొక్కుతున్న స్టోన్ క్రషర్ నిర్వాహకులు.
- నిబంధనలు పాటించకపోవడంతోనే మరణాలు అంటూ ప్రజల ఆగ్రహం
- మామూళ్లు మత్తులో మైనింగ్ శాఖ అధికారులు
- విచ్చలవిడిగా తవ్వకాలు..





**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో**: జిల్లా వ్యాప్తంగా స్టోన్ క్రషర్ల యజమానులు బండరాళ్ల కోసం క్వారీల వద్ద భారీ గుంతలు తవ్వుతున్నారు. బండరాళ్లను తీసి గుంతలను అలాగే వదిలేస్తున్నారు. ఈ గుంతలే మృత్యుఘటికలుగా మారుతున్నాయి. శవాలను వెలికి తీయడానికి గజ ఈతగాళ్ల అవసరం పడుతున్నదంటే , ఆ గుంతల లో ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పెద్ద బండరాళ్ల కోసం పెద్దపెద్ద గుంతలు తీసి అలాగే వదిలేయడంతో వర్షాకాలంలో నీరు నిలిచి మనుషులకే కాకుండా పశువులు మృతి చెందుతున్నాయి. జిల్లాలోని బజార్హత్నూర్ మండలం పిప్పిరి గ్రామ శివారులో ఉన్న స్టోన్ క్రషర్ యజమాన్యాలు బండరాళ్ల కోసం తీసిన గుంతలో వారం రోజుల వ్యవధిలో గుంతల్లో పడి ఇద్దరు మృతి చెందారు. బండరాళ్ల కోసం తవ్విన పెద్ద పెద్ద గుంతలను మట్టితో లేదా ఇసుకతో పూడ్చాలి, లేదా గుంతల చుట్టూ కంచే ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్నా కూడా ఈ నిబంధన పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**వారం రోజుల్లో ఇద్దరిని మింగిన గుంత..**

మండలంలోని పిప్రి గ్రామంలో స్టోన్ క్రషర్ గుంతలో చత్తీస్గడ్ నుండి వలసగా కూలీలుగా వచ్చిన మండరి భారత్, గాయత్రీ కుటుంబానికి చెందిన కలిశ్వరి, సంజన ఇద్దరు కుమార్తెలు రోజు మాదిరిగా పక్కనే వున్నా క్రేషర్ వద్ద తవ్విన క్వారీ గుంతలో స్నానానికి వెళ్లగా.. చిన్న కుమార్తె సంజనకు పిడ్స్ వచ్చి గుంతలో పడి మృతి చెందింది. మండలంలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన రాకేష్ అనే యువకుడు పిప్పిరి గ్రామ పరిధిలోని స్టోన్ క్రషర్ యజమానులు తవ్విన భారీ నీటి గుంతలో గణపతి నిమర్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు.

**ఇష్టారీతిన వ్యవహరిస్తూ..**

జిల్లావ్యాప్తంగా క్రషర్ నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. క్వారీలు ఉన్న ప్రాంతాల్లో నిబంధనల పేరిట లైసెన్సులు తీసుకుని అసైన్డ్ భూములు, వక్ఫ్‌ాములు, ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా క్వారీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అందులో బండరాళ్లను వెలికి తీసి క్రషర్లకు తరలిస్తున్నారు. లైసెన్స్ పొందేది ఐదేకలరాలకు కానీ తవ్వేది మాత్రం వందల ఎకరాలు%ొ% అయితే నిర్వాహకులు అటు రెవెన్యూ అధికారులను , మైనింగ్ అధికారులను తమ మాముల్లతో మచ్చిక చేసుకుని.. అడ్డు అదుపులేకుండ పని కానిచ్చేస్తున్నారనీ వినికిడి.సమీపభూ యజమానులకు ఎంతోకొంత ముట్టజెప్పి ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. మైనింగ్ శాఖ అధికారులు క్రషర్లకు అనుమతులు ఇచ్చిన క్వారీలో బ్లాస్టింగ్ చేసేందుకు పోలీసు, రెవెన్యూశాఖ అనుమతులు తీసుకోవాలి. కానీ.. క్రషర్ యజమానులు తమ పలుకుబడితో క్రషర్ల నిర్వహణ చేపడుతూ జిల్లా ప్రజలకు ఇబ్బందులు కలిగేలా చూస్తున్నారు. వరస మరణాలు జరుగుతున్న కూడా మైనింగ్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు - జిల్లా కలెక్టర్ దీని పై దృష్టి సారించి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న క్రషర్ల పై కోరాడ ఝులిపించాలని కోరుతున్నారు.



## ఇంటి నల్లాల కనెక్షన్ పై అవగాహన సమావేశం

**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** బజార్ హత్నూర్ మండలం లోని ఎంపీడీఓ కార్యాలయం లోని సమావేశమందిరంలో సోమవారం రోజు ఇళ్లకు పంపిణీ చేసే నల్లాల కనెక్షన్ కు సంబంధం గల అంశాల పై వచ్చిన గ్రామ నీటి సరఫరా సహాయకులకు అవగాహన కల్పించారు.మోటారు, కరెంట్ విడి బాగాలు ప్రత్యేకంగా ప్రదర్శన ద్వారా చూయించు చూ వివరంగా తెలియజేశారు. ఏవైనా అనుమానంలు ఉన్న ఎడల అడిగిన పక్షంలో మళ్ళీ వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో వివిధ గ్రామంలోని గ్రామ సాయకులు, ఆర్ డబ్ల్యూ ఎస్ (మిషన్ భగీరత)అధికారి వెంకట్, మరో అధికారిలు పాల్గొన్నారు.

## మండలానికి పట్టిన గ్రహణం జ్వరం

### జ్వరంతో ఒకరు మృతి



మహబూబాబాద్ జిల్లా: కొత్తగూడ మండలం మైలారం గ్రామానికిచెందిన బాదవత్ స్వామి డెంగ్యూ జ్వరం తో మృతి తెల్ల రక్త కణాలు తగ్గడంతో హాజర హాస్పటిల్. చికిత్స పొందుతూ మృతి మండల కేంద్రంలో వరుసగా జ్వరలతో మృతి చెందున్నారు.

## రోడ్డెక్కిపాడిరైతుల ఆందోళన



అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో సోమవారం రోజు పాడి రైతులు రోడ్డెక్కి ఆందోళన కు దిగారు. సుని మూడు నెలలనుంచి బకాయి విజయ డైరీకి చెందిన యాజమాన్యం అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం నుంచి విజయ డైరీ పాల బిల్లులు రానందున విజయ డైరీ పాడి రైతులు బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. తాము బిల్లులు అందక ఎంతో తిప్పల్ని ఎదుర్కొని ఇటు పశువులకు సరిపడా ధాన అందించలేక చేస్తున్నా, మాపై ఇంతకూడా ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. ఎక్కువ మొత్తంలోని పాడి రైతులు భూమి లేని వారేనని, మా కుటుంబ పోషణకు ఇదే ఆధారం ఇటు తిప్పలు పడలేక అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడినదని ఆవేదన చెందుతున్నారు.పాడి రైతులు వారి పాల డబ్బాల ప్రదర్శన చేస్తూ నేల మీద పితికిన పాలు ఒకపోసి నిరసన వ్యక్త పరిచారు. ఇకనైనా విజయ డైరీ పాల బిల్లులు రైతులకు త్వరగా అందించాలని కోరారు.

## సమాజానికి సేవ చేయడం ఒక సామాజిక బాధ్యత



**శంకర్పల్లి సెప్టెంబర్ 23:(డైలీ రిపోర్ట్):** ఉపాధ్యాయుడు,మరియు సామాజిక కార్యకర్త మర్పల్లి అశోక్ ఇటీవల రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ ప్రధానం చేసిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న సందర్భంగా శంకర్పల్లి మండలంలోని క్రిస్టల్ టౌన్షిప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మర్పల్లి అశోక్ గారిని శాలువ,పూలమాలలతో ఘనంగా సత్కరించడం జరిగింది.ఈ సందర్భంగా కాలనీవా గౌరవ పెద్దలు గోవింద్ రెడ్డి,మరియు సభ్యులు గోపాల్ రెడ్డి,శ్రీశైలం,మల్లేష్ యాదవ్,సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ... పేద విద్యార్థుల చదువు కోసం అనేక సేవలు అందించడం వల్ల జిల్లా స్థాయిలో అవార్డు అందుకున్నటువంటి ఉపాధ్యాయుడు మా కాలనీలో ఉండడం మాకు గర్వకరాణమని,ప్రభుత్వ బడుల్లో చదువుకునే పేద విద్యార్థులకు అవసరమైనటువంటి పుస్తకాలు,బ్యాగులు, పెన్నులు,పలకలు తదితర సామాగ్రిని పిల్లల చదువు కోసం అందజేస్తూ, తల్లిదండ్రులకు పిల్లల చదువు భారం కాకుండా తన యొక్క సేవలను అందిస్తూ,శంకర్పల్లి మండలంలోనే ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం జరిగిందన్నారు. మునుముందు మరిన్ని విద్యాపరమైన సేవ, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ,రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డు అందుకోవాలని ఆకాంక్షించడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మర్పల్లి అశోక్ మాట్లాడుతూ... నీతి,నిజాయితీతో,నిస్వార్థ సేవలు అందిస్తు బడుగు బలహీన వర్గాల పిల్లల కోసం అనునిత్యం కృషి చేస్తున్నందుకు గాను జిల్లా స్థాయి పురస్కారం అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలియజేస్తూ,పేద విద్యార్థులకు సేవ చేయడంలో దొరికేటటువంటి సంతృప్తి మరెందులో దొరకదని ఉపాధ్యాయ వృత్తి అనేది జీతం కోసం చేసేది కాదని, జీవితాలను తీర్చిదిద్దే ఉన్నతమైన వృత్తి అని తెలపడం జరిగింది.మనం ఏ వృత్తిలో కొనసాగిన,ఏ ప్రాంతంలో నివసించిన సమాజ సేవ అనేది ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలని,మనం సంపాదించిన దాంట్లో కొంత సమాజానికి చెల్లిస్తే అది మనకు ఎంతో సంతృప్తినిస్తుందని తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో విక్రమ్ రెడ్డి,సువాన్ రెడ్డి,ప్రవీణ్ రెడ్డి,శివ గౌడ్,రవి,శ్రీశైలం గౌడ్,శ్రీనివాస్,రాము, అనిరుద్,సాయి,రాకేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707